సాక్షి పెద్దపల్లి

గురువారం । 5 । అక్టోబర్ । 2023



మల్లన్న సన్నిధిలో సందడి

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జునస్వామిని బుధవారం వేలాదిమంది భక్తులు దర్శించుకున్నారు. బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించారు.



ఆకట్టుకున్న భజనలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీ చిలుకలయ్య ఆలయంలో భజన నిర్వహించారు. రామాలయం పునః నిర్మాణంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

గరిష్టం/కనిష్టం 29.0 /26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన జడ్జి వెంకట సచిన్‌రెడ్డి



జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ధర్మారం: నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జిగా నల్లాల వెంకట సచిన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నందిమేడారం కోర్టుకు తొలిజడ్జిగా నియమితులైన వెంకట సచిన్‌రెడ్డిని న్యాయవాదులు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గాగిరెడ్డి మల్లారెడ్డి, నార అశోక్‌రెడ్డి, గడ్డం లింగారెడ్డి, ఈదుర ప్రదీప్‌రెడ్డి, ఆకారి రాజేశం, ఎంపెల్లి ప్రకాశ్, బొట్ల లక్ష్మీనర్సయ్య, నూనె సత్యనారాయణ, జితేందర్ రెడ్డి, సందీప్, సంతోష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పేషెంట్ల రద్దీ



పేషెంట్లతో కిటకిటలాడుతున్న జీజీహెచ్

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) రెండురోజులుగా ఔట్ పేషెంట్లతో కిటకిటలాడుతోంది. మంగళవారం 1,100 మందికిపైగా ఓపీ నమోదు చేసుకున్నారు. బుధవారం 820 మందికిపైగా ఓపీ నమోదు అయ్యింది. దగ్గు, జ్వరం, జలుబు, ముక్కు కారడం, తలనొప్పి, వాంతులు తదితర అనారోగ్య సమస్యలతో ప్రజలు ఆస్పత్రికి వస్తున్నారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతోనే అందరికి ఫ్లూ వైరస్ వ్యాపిస్తోందని, అందరూ మాస్కులు ధరించాలని, వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



దుకాణం పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

జూలపల్లి(పెద్దపల్లి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కరీంనగర్ డీఆర్‌డీఏ ఏపీడీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీలతో నిర్వహిస్తున్న వ్యాపారాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. వ్యాపారంలో మెలకువలు పాటించాలని మహిళలకు సూచించారు. పెద్దపల్లి డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ సునీత, డీపీఎం రవి, ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాస్(సుల్తానాబాద్), సీసీలు జ్యోతి, శ్రీధర సీఎలు స్రవంతి, గీత, సల్మా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

రామగుండం: స్థానిక ఐటీఐలో గురువారం విదేశాల్లో ఉద్యోగావకాశాల కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టామని జిల్లా ఉపాధి కల్పనాధికారి వై.తిరుపతిరావు బుధవారం తెలిపారు. ఆస్ట్రేలియా, జర్మనీ, యూకే తదితర దేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద నమోదైన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ 'టామ్‌కామ్' ద్వారా అర్హత, నైపుణ్యం కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గలవారు టామ్‌కామ్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం www.tomcomtelangana.gov.in వెబ్‌సైట్‌తోపాటు 82478 38789, 78935 66493, 98496 39539 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సర్కార్ హామీతో సమ్మె విరమణ

పెద్దపల్లిరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం 34రోజులుగా చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించింది. ఈమేరకు బుధవారం జరిపిన చర్చల్లో సానుకూలంగా హామీ ఇచ్చింది. దీంతో సమ్మెను విరమిద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సునీల్ అన్నారు. స్థానిక అమరవీరుల స్థూపం వద్ద బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలు, ఆయాలకు 65ఏళ్ల వయోపరిమితి విధించేందుకు, ప్రమాద బీమా వర్తింపజేసేందుకు, పెన్షన్, సమ్మెకాల వేతనం ఇవ్వడంలాంటి హామీలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు ఆయన వివరించారు.

ఓటర్లు.. 31.12 లక్షలు

ఉమ్మడి జిల్లాలో మహిళలే ఎక్కువ

- ఐదేళ్ల కింద 13 నియోజకవర్గాల్లో 27.88 లక్షల మందే
- కొత్త ఓటర్ల సంఖ్య 3,24,198
- కరీంనగర్‌లో అత్యధికం, రామగుండంలో అత్యల్పం
- దరఖాస్తుకు ఇంకా గడువు ఉందన్న ఎన్నికల సంఘం





సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

త్వరలో జరగనున్న ఎన్నికలకు అధికారగణం సిద్ధమైంది. ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 31,12,283 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27,88,085 మంది ఉండగా.. ఐదేళ్లకు 3,24,198 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. వీరిలో అధిక శాతం యువతే. ఓటరు నమోదుపై ఎన్నికల సంఘం చేసిన ప్రచార కార్యక్రమాలు, ప్రధాన మీడియా, సోషల్ మీడియా ద్వారా చేసిన ప్రచారం ఇందుకు దోహదపడిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. బీఎల్‌వోలకు ఇచ్చిన శిక్షణ, డబుల్ ఓట్ల ఏరివేత, మరణించినవారి ఓట్లు తొలగింపు, ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లలో కుటుంబాల ప్రత్యక్ష తనిఖీలు, నకిలీ ఓటర్ల వడపోత తదితరాల ఫలితంగా ఈసారి వీలైనంత వరకు దోషాలు లేని జాబితాను రూపొందించినట్లు తెలిపారు.

ప్రతీ నియోజకవర్గంలో పెరిగిన సంఖ్య..

ప్రతీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. మొత్తం 13 నియోజకవర్గాల్లో సంఖ్యాపరంగా చూసినప్పుడు 3,41,913 మంది ఓటర్లతో కరీంనగర్ అగ్రస్థానంలో నిలవగా.. 2,14,974 ఓటర్లతో పెద్దపల్లి జిల్లా రామగుండం చివరి స్థానంలో నిలిచింది. కరీంనగర్ జిల్లాలో కొత్తగా 54,831 మంది నమోదయ్యారు. నగరంలో పెరిగిన సదుపాయాలు, వలసలు, విద్యాసంస్థలు, ఉమ్మడి జిల్లాలో రిటైరైన వారంతా ఇక్కడే స్థిరపడటం తదితరాలు ఇందుకు కారణమని అధికారులు అంటున్నారు. మిగిలిన 12 నియోజకవర్గాల్లోనూ వేలాదిగా ఓట్లు పెరగడం నేటితరంలో ఓటు చైతన్యంపై వచ్చిన మార్పుగా మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

పెరుగుదల ఇలా..

కోరుట్లలో 20,652, జగిత్యాలలో 24,021, ధర్మపురిలో 17,890, రామగుండంలో 25,882, మంథనిలో 23,591, పెద్దపల్లిలో 27,413, కరీంనగర్‌లో 54,831, చొప్పదండిలో 16,957, వేములవాడలో 25,451, సిరిసిల్లలో 22,408, మానకొండూర్‌లో 15,909, హుజూరాబాద్‌లో 35,181, హుస్నాబాద్‌లో 14,005 మంది ఓటర్లు పెరిగారు.

సర్వీసు ఓటర్లు 1,594 మంది..

ఉమ్మడి జిల్లాలో నియోజవర్గాల వారీగా సర్వీసు ఓటర్లు.. కరీంనగర్‌లో 101, చొప్పదండిలో 192, మానకొండూరులో 128, హుజూరాబాద్‌లో 163, కోరుట్లలో 47, జగిత్యాలలో 43, ధర్మపురిలో 131, వేములవాడలో 52, సిరిసిల్లలో 106, రామగుండంలో 213, మంథనిలో 155, పెద్దపల్లిలో 263 మొత్తం1,594 మంది ఉన్నారు. వీరంతా సైన్యంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి..

సెప్టెంబరు 19 వరకు కొత్త ఓటర్ల నమోదు, ఓటు బదిలీ, సవరణలకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఒకవేళ ఓటుపై అభ్యంతరాలు, ఇతర క్లెయిములు ఇంకా పరిష్కారానికి నోచుకోని వారి దరఖాస్తులు పరిష్కరిస్తారు. అలాగే, ఇంకా దరఖాస్తు చేసుకోని కొత్త పౌరులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. నామినేషన్‌కు ఆఖరు తేదీకి సరిగ్గా 10 రోజుల ముందు వరకు అవకాశం ఉంటుందని తెలిపింది. అన్ని రకాల దరఖాస్తులకు voters.eci.gov.in వెబ్‌సైట్‌లో లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ) లేదా బీఎల్వోను లేదా ఓటరు హెల్ప్‌లైన్ 1950లో సంప్రదించవచ్చు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
కరీంనగర్	1,71,254	1,70,615	44	3,41,913
చొప్పదండి	1,11,197	1,18,141	08	2,29,346
మానకొండూరు	1,07,371	1,11,041	01	2,18,413
హుజూరాబాద్	1,19,676	1,24,833	05	2,44,514
జగిత్యాల	1,09,300	1,17,315	20	2,26,635
కోరుట్ల	1,13,030	1,23,692	04	2,36,726
ధర్మపురి	1,09,963	1,14,622	06	2,24,591
సిరిసిల్ల	1,17,872	1,22,920	06	2,40,798
వేములవాడ	1,04,943	1,13,186	31	2,18,160
పెద్దపల్లి	1,23,768	1,25,555	09	2,49,332
రామగుండం	1,08,233	1,06,716	25	2,14,974
మంథని	1,13,828	1,16,458	20	2,30,306
హుస్నాబాద్	1,17,165	1,19,406	04	2,36,575
మొత్తం	15,27,600	15,84,500	183	31,12,283

క్రీడలకు ప్రోత్సాహం

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం యువతలో క్రీడాస్ఫూర్తి పెంచేలా ప్రోత్సాహం అందిస్తోందని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. బుధవారం ఎంపీడీవో ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. క్రీడాప్రాంగణానికి ఓ స్పోర్ట్స్ కిట్ అందించిందని, ఆ సామాగ్రితో ఆటల ద్వారా నైపుణ్యం పెంచుకునేలా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రోత్సహించాలని కోరారు. ఎంపీపీ స్రవంతి, జిల్లా స్పోర్ట్స్ అధికారి సురేశ్, డీసీవో మైఖేల్‌బోస్, ఎంపీడీవో రాజు ఉన్నారు.

సీఎమ్మార్‌ను సకాలంలో పూర్తిచేయండి

పెద్దపల్లిరూరల్: సీఎమ్మార్ డెలివరీ ప్రక్రియ సకాలంలో పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత అధికారులు, మిల్లర్లతో సమీక్షించారు. సీఎమ్మార్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై చర్యలు తప్పవన్నారు. మిల్లులను పూర్తిసామర్థ్యంతో నడిపి డెలివరీ చేయాలని సూచించారు. సివిల్ సప్లయి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్‌వో ప్రేంకుమార్, మిల్లర్లు తిరుపతిరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులతో భేటీ

రామగుండం: ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన రామగుండం మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ బుధవారం హైదరాబాద్ బషీర్‌భాగ్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో అంతర్గాం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతినాయక్, జాతర కమిటీ చైర్మన్ గీట్ల శంకర్‌రెడ్డి, కుర్ర నూకరాజు, బర్మా, కాందిశీకుల సంఘం అధ్యక్షుడు జమ్ముల రామారావు తదితరులు ప్రమాణ స్వీకారానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం కేసీఆర్‌వి విప్లవాత్మక నిర్ణయాలు

- రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌లో నిలుపుతున్నారు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ధర్మారంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్ స్థానానికి ఎదిగిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో రూ.14.20 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.75లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి, ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ పనులకు బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. రచ్చపల్లి ప్రభుత్వ పాఠశాలలో మన.. ఊరు మనబడి ద్వారా నిర్మించిన భవనాలు ప్రారంభించారు. అనంతరం ఈశ్వర్ మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి వృద్ధుల వరకు సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. బతుకమ్మ కానుకగా మహిళలకు చీరలు అందిస్తున్నారని తెలిపారు. దీనిద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడ్డాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు మోసపూరిత మాటలు చెబుతూ అధికారంలోకి రావాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వారిని నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, నాయకులు మోర సుధాకర్, ముత్యాల బలరాంరెడ్డి, పుస్కూరి పద్మజ, బలరాం రెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, నోముల వెంకటరెడ్డి, పుస్కూరి నర్సింగరావు, జైన రాజమౌళి, మెడవేని తిరుపతి, రామారావు, పాకాల రాజయ్య, నార బ్రహ్మయ్య, ఎంపీడీవో జయశీల పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

స్థానిక అమ్మ భగవాన్ ఆలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ భగవాన్ ధర్మ సంస్థాపక్ పుస్కూరి రామారావు దంపతులు మంత్రిని ఆహ్వానించారు. అనంతరం ప్రత్యేకపూజలు చేశారు. వచ్చే ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ రామారావు పూజలు నిర్వహించారు.

ముదిరాజ్‌లకు చట్టసభల్లో ప్రాతినిధ్యం ఏది?

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్



శంకర్‌ను సత్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: చట్టసభల్లో ముదిరాజ్‌లకు కనీస ప్రాతినిధ్యం లేదని, ఈసారి ఎన్నికల్లో కచ్చితంగా జనాభా ప్రాతిపదికన 16 అసెంబ్లీ స్థానాల్లో పోటీకి అన్నిరాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఆత్మగౌరవ సన్నాహక సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తక్కువశాతం ఉన్న అగ్రవర్ణాల ప్రతినిధులు అధికారం చలాయిస్తుంటే.. అధిక శాతం ఓటర్లు ఉన్న బీసీలమంతా అట్టడుగున ఉండడమేంటని ప్రశ్నించారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి 20 ఏళ్ల కిందట ఒక్కసారే బీసీ బిడ్డ అసెంబ్లీకి ఎన్నికయ్యారని, అదేరీతిన ముదిరాజ్‌లంతా ఇతర కులస్తులను కలుపుకుని వచ్చే ఎన్నికల్లో విజయం లక్ష్యంగా ముందుకు సాగుదామని కొలిపాక శ్రీనివాస్ కోరారు. ఈసారి ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టాలని సూచించారు.

8న హైదరాబాద్‌లో సభ

ఈనెల 8న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టే ముదిరాజ్ మహాసభను విజయవంతం చేయాలని శంకర్, శ్రీనివాస్, నర్సయ్య, చిరంజీవి కోరారు. ఈ సందర్భంగా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గం నుంచి 150దాకా బస్సులను అందుబాటులో ఉంచామని అన్నారు. నాయకులు ఐలవేణి వీరస్వామి, బొజ్జ సారయ్య, రాజేశం, సబ్బు మల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అరవై ఏళ్లలో ఆగం చేసిన కాంగ్రెస్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: అరవై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల బతులకులను ఆగం చేసిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక 31వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాన్ని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. కాంగ్రెస్, టీడీపీల పాలనలో తెలంగాణ ప్రజల బతుకులు నాశనం అయ్యాయన్నారు. సీఎం కేసీఆర్ సింగరేణి వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించి 22 వేల మంది జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు గోదావరిఖనిలో ఐటీ పార్క్, అంతర్గాంలో ఇండస్ట్రియల్ పార్క్‌ను మంత్రి కేటీఆర్ ద్వారా మంజూరు చేయించానని ఆయన పేర్కొన్నారు. ఈప్రాంతాన్ని మంత్రి దత్తత తీసుకుంటానని చేసిన ప్రకటనతో సిరిసిల్ల, సిద్దిపేట తరహాలో మారబోతుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చర్చకా.. పక్కకా..!

నగరాన్ని చుట్టుముట్టిన సమస్యలు

- కంపుకొడుతున్న సమ్మక్క- సారలమ్మ జాతర ప్రాంగణం
- డంపింగ్ యార్డ్‌గా మారిన గోదావరి నదీతీరం
- హాట్‌టాపిక్‌గా బల్దియా స్థలాల లీజు వ్యవహారం
- ఆరేళ్లుగా పట్టింపులేని స్మృతి వనం
- నిర్లక్ష్యంలో పాలకవర్గం, అధికారులు
- నేడు రామగుండం నగరపాలక సమావేశం

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలో ఏకైక నగర పాలక సంస్థ.. ఆర్థికంగా, రాజకీయంగా, అభివృద్ధిపరంగా ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేకత సంతరించుకున్న కార్పొరేషన్.. అన్నివిధాలా ఆదర్శంగా నిలవాల్సిన రామగుండం.. అనేక సమస్యలతో సతమతమవుతోంది. మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన గురువారం 14వ సాధారణ సమావేశం నిర్వహించేందుకు సిద్ధమైంది. దీర్ఘకాలంగా బల్దియా వాసులను వేధిస్తున్న అతిప్రధాన డంపింగ్‌యార్డు, మహిళా స్వశక్తి సంఘాల సొంతభవన నిర్మాణాలకు స్థలం కొరతపై ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రశ్నిస్తే.. అధికారపక్షం సమాధానం చెబుతుందా? ఎదురుదాడి చేస్తుందా? పరిష్కార మార్గం చూపుతుందా? అని ప్రజలు ఎంతోఆశతో ఎదురుచూస్తున్నారు.



సమ్మక్క సారలమ్మగుడి ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

డంపింగ్ యార్డుగా గోదావరి నదీతీరం..

పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యానికి గోదావరి నదీతీరం కలుషితమౌతోంది. జిల్లాలోనే అతిపెద్ద రామగుండం బల్దియాలో డంపింగ్‌యార్డు లేక చెత్తాచెదారం నదిలో కలుస్తోంది. దేశమంతా స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్ చేపట్టి నగరాలు పరిశుభ్రంగా మారుతుంటే.. ఇక్కడ అందుకు విరుద్ధంగా ఉంది.

సమ్మక్క-సారలమ్మ భక్తులకు ముప్పు...

మరో నాలుగు నెలల్లో గోదావరి తీరంలో సమ్మక్క - సారలమ్మ జాతర జరుగుతుంది. జాతర స్థలం సమీపంలోనే చెత్తకుప్పలు గుట్టలుగా పేరుకుపోయాయి. 50 డివిజన్లలో రోజూ సుమారు 115 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. వీటన్నింటినీ నదీతీరంలోని జాతర ప్రాంతంలోనే పోస్తున్నారు. కుళ్లిపోయి కంపుకొడుతున్న వ్యర్థాల్లోంచి ప్రమాదకర విషవాయువులు వెలువడుతున్నాయి. జాతరకు వచ్చే భక్తులు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది.

జాడలేని స్మృతి వనం..

గోదావరి తీరంలోని హిందూ స్మశానవాటికలో స్మృతి వనం ఏర్పాటు చేస్తామని 2018లో అప్పటి పాలకవర్గం ప్రకటించింది. మృతుల పేరిట మొక్కలు నాటి, సంరక్షిస్తామని చెప్పి ఐదేళ్లు గడిచినా అతీగతీలేదు. మృతుల కుటుంబసభ్యులు కొందరు మొక్కలు నాటేందుకు ముందుకు వస్తే.. ఒక్కొక్కరి నుంచి రూ.2వేల ఫీజు బల్దియా వసూలు చేశారు. అయినా, ఒక్క మొక్క నాటిందీ లేదు. వాటిని సంరక్షించిందీ లేదు. గ్రీన్ బడ్జెట్ కింద పార్కులు, జంక్షన్లు, సెంట్రల్ మీడియన్స్, శ్మశాన వాటిక, స్మృతివనం, ప్రకృతి వనాలు, ఎస్టీపీ నిర్వహణకు 22 మంది అవసరమని, వీరికి 12 నెలలకు వేతనాల కింద రూ.42 లక్షల ఆమోదం కోసం ఎజెండాలో పొందుపరిచారు.

హాట్‌టాపిక్‌గా స్థలాల లీజు అంశం..

బల్దియా స్థలాలను లీజుకు ఇచ్చేందుకు బల్దియా సమావేశం ఎజెండాలో పొందుపర్చడం హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడానికి నిరుపయోగ స్థలాలను లీజుకు ఇవ్వడం వివాదంగా మారే అవకాశం ఉందంటున్నారు. నగరంలో స్వశక్తి మహిళా సంఘాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన నిధులు ఉన్నా.. స్థలాలు లభించడంలేదు. స్థలం కొరతపై అనేకసార్లు అధికారులు విన్నవించినా ప్రయోజనం లేకుండాపోతోంది. అయితే, ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయనే వివరాలను ఎజెండాలో పొందుపర్చకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు?

- పాత మున్సిపల్ బల్దియాలో రూ.8కోట్లతో మల్టీ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్, విఠల్ నగర్‌లో రూ.5కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.
- గోదావరిఖని హనుమాన్‌నగర్‌లో రూ.4కోట్లతో ఆడిటోరియం, రూ.9.5 కోట్లతో కమ్యూనిటీ హాల్స్, రూ.2కోట్లతో సీనియర్ సిటిజన్ క్లబ్, రూ.3కోట్లతో స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ స్టేడియం, రూ.కోటితో పశువైద్యశాల తదితర పనులు ఇంకా మొదలే కాలేదు.
- ప్రశాంత్‌నగర్‌లో మల్కాపూర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చే పనులు పూర్తికాలేదు. పర్యవేక్షణ లేక శిఖం కబ్జాకు గురవుతోందనే ఆరోపణలు ఉన్నాయి.
- విఠల్‌నగర్, ఎన్టీఆర్‌నగర్‌లో కూరగాయలు, మాంసాహార క్రయ, విక్రయాల కోసం అత్యాధునిక సదుపాయాలతో సుమారు రూ.9 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ భవన నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి.
- సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) లేక మురుగునీరంతా నేరుగా గోదావరిలో కలుస్తోంది. దీంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రామగుండం మెరుగైన ర్యాంకులో సాధించలేకపోతోంది.
- ఆస్తిపన్నులో 8 శాతం లైబ్రరీ సెస్ వసూలు చేస్తున్నా.. లైబ్రరీకి పక్కా భవనం లేదు. సింగరేణి అద్దె భవనంలో, కనీస సౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఈ సమస్యలు కనీసం ఈ సమావేశంలోనైనా పరిష్కారమవుతాయని నగరవాసులు ఎంతోఆశతో ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో కార్పొరేటర్ల చేరిక



కార్పొరేటర్లకు కండువా కప్పుతున్న కేటీఆర్

గోదావరిఖని: ముగ్గురు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం తీసుకున్నారు. బీజేపీకి చెందిన 16, 40వ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు మందల కిషన్‌రెడ్డి, దుబాసి లలిత, ఒకటో డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ ముదాం శ్రీనివాస్ బీఆర్‌ఎస్‌లో చేరగా మంత్రి కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రగతిభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చందర్ వారిని మంత్రికి పరిచయం చేశారు. రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను గెలిపించాలని కేటీఆర్ కోరారు.

శంకర్‌కు జాతీయ అవార్డు



ఆడెపు శంకర్

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన సామాజికవేత్త, పద్మశాలీ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్ మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ సంస్థ ప్రతీ ఏడాది సామాజిక వేత్తలకు, సంఘ సేవకులకు జాతీయ స్థాయిలో అవార్డులను ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా ఆడెపు శంకర్‌ను అవార్డుకు ఎంపిక చేస్తున్నట్లు బుధవారం బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణ ప్రకటించారు. హైదరాబాద్‌లో అవార్డు ఎంపిక కాపీని రాధాకృష్ణ చేతుల మీదుగా శంకర్ అందుకున్నారు. ఈనెల 15న ఢిల్లీలో జరిగే బహుజన రైటర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందుకోనున్నట్లు శంకర్ తెలిపారు.

ఉరి వేసుకుని రిటైర్డ్ కార్మికుడి మృతి

గోదావరిఖని: స్థానిక ఉదయ్‌నగర్‌కు చెందిన బియ్యాని కొమురయ్య(60) బుధవారం ఉరివేసుకుని మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన కొమురయ్య.. మానసిక సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని, పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా తగ్గకలేదన్నారు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఇంటిపక్కన గల మామిడి చెట్టుకు ఉరివేసుకుని చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

జాతీయ క్రీడా రత్న అవార్డుకు ఎంపిక



ఎంపిక పత్రం అందుకుంటున్న రాంనారాయణ

జ్యోతినగర్(రామగుండం): బహుజన సాహిత్య అకాడమి(బీఎస్‌ఏ) జాతీయ క్రీడా రత్న అవార్డుకు క్రీడాకారుడు మంగళంపల్లి రాంనారాయణ ఎంపికయ్యారు. అవార్డు సెలక్షన్ కమిటీ జాతీయ చైర్మన్ నల్లా రాధాకృష్ణ బుధవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయంలో రాంనారాయణకు అవార్డు ఎంపిక పత్రాన్ని అందించారు. ఆయనను పలువురు అభినందించారు.

ఆగని అక్రమాలు

- మాయమవుతున్న రేషన్ బియ్యం
- గోదాం నిర్వాహకుల ఇష్టారాజ్యం
- నామ్‌కే వాస్తేగా డీలర్ల బయోమెట్రిక్
- పౌర సరఫరాల శాఖలో నిస్తేజం



తూకం వేయకుండానే డీలర్ల కోసం లారీలో నుంచి వ్యాన్‌లో బియ్యం లోడ్ చేస్తున్న హమాలీలు

పెద్దపల్లిరూరల్: పేదల చేర్చాల్సిన రేషన్ బియ్యం నిల్వచేసే గోదాములు అక్రమాలకు చిరునామాగా మారాయి. కొద్దినెలల క్రితం అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో పెద్దపల్లి, సుల్తానాబాద్ గోదాముల ఇన్‌చార్జీలను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయినా దందా ఆగడం లేదు. తాజాగా.. జిల్లా కేంద్రంలోని గోదాములో 741 బస్తాల సన్నబియ్యం, 99 బస్తాల సీజ్ బియ్యం మాయమైనట్లు బుధవారం నాటి విజిలెన్సు అధికారుల తనిఖీల్లో వెలుగు చూశాయి.

ఇన్‌చార్జీల ఇష్టారాజ్యం..

- సివిల్ సప్లయి గోదాములకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్న అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- గోదాముల్లో నిల్వ ఉండే సన్నరకం బియ్యాన్ని పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం, గోదావరిఖనిలోని కొందరు అనుకూలమైన డీలర్లకే అప్పగిస్తున్నారనే విషయం ఆధారాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

మళ్లీ డీలర్ల నుంచే కొనుగోలు

గోదాముల్లోని సన్నరకం బియ్యాన్ని అక్రమంగా అమ్ముకుంటున్న ఇన్‌చార్జీలు.. మళ్లీ రేషన్ డీలర్ల నుంచి కొనుగోలు చేసి సర్దుబాటు చేసుకుంటున్నట్లు సమాచారం. కొందరు డీలర్లు లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని వారినుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాము ఇన్‌చార్జికి అప్పగిస్తున్నారని తెలిసింది. గోదాముల్లో బియ్యం లోటును పూడ్చేందుకు డీలర్లు లబ్ధిదారుల నుంచి రూ.12 నుంచి రూ.18దాకా వెచ్చించి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

బయోమెట్రిక్ నామమాత్రమే..

- పౌర సరఫరాల గోదాముల వద్దకు రేషన్ డీలర్లు వచ్చి వేలిముద్ర వేస్తున్నా గోదాల ఇన్‌చార్జీలు తూకం వేయడం లేదని డీలర్లు మొత్తుకుంటున్నారు.
- బస్తాపై నాలుగైదు కిలోలు తక్కువగా వస్తుండడంతో తాము ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.
- గోదాముల వద్ద గంటల తరబడి నిరీక్షించినా.. తూకంలో మోసపోకతప్పడం లేదని అంటున్నారు.
- పాలకుర్తి మండలానికి చెందిన ఓ డీలరు తనకు తూకం వేసి ఇస్తేనే తీసుకుంటాననడంతో సదరు డీలరుకు సీజ్ చేసిన బియ్యంలో చిరిగిన, పాడైన సంచులు, నాసిరకం బియ్యాన్ని పంపి ఇబ్బంది పెట్టినట్లు సమాచారం.

లెక్కతేలితేనే..

ప్రస్తుతం పెద్దపల్లి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న తిరుపతిని తప్పించి పౌర సరఫరాల డీఎం కార్యాలయ అధికారి నర్సింహారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. అయితే గోదాములో నిల్వఉన్న బస్తాలు, రికార్డులతో సరిపోలితేనే బాధ్యతలు స్వీకరిస్తానని ఆయన చెప్పి చార్జీ తీసుకునేందుకు విముఖత చూపినట్లు తెలిసింది. ఈలోగా విజిలెన్సు అధికారులు విచారణ చేయడంతో బియ్యం నిల్వల్లో లోటు ఉన్నట్లు తేలింది.

తూకం వేయడంలేదు



గోదాముల వద్ద బయోమెట్రి క్ లింక్‌తో తూకం వేసే ఏర్పా ట్లు చేశారు. దీంతో మాకు సరైన తూకంతో బియ్యం వస్తాయని సంతోషపడ్డాం. కానీ గోదాముల వద్ద తూకం లేకుండానే నేరుగా సంచులు వేస్తుండడంతో నష్టపోతున్నాం.
–కిషన్‌రెడ్డి, యైటింక్లయిన్‌కాలనీ డీలరు

విచారణ జరుపుతాం

సివిల్ సప్లయి గోదాముల్లో అవకతవకలకు పాల్పడ్డట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. రేషన్ డీలర్లకు తూకం వేసిన తర్వాతే బియ్యాన్ని పంపాలని ఆదేశాలిచ్చాం. సుల్తానాబాద్ ప్రాంత దుకాణాల్లో తనిఖీలు చేశాం.
– ప్రేమ్‌కుమార్, డీఎస్‌వో, పెద్దపల్లి

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



మధును గజమాలతో సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

రామగిరి: కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కోరారు. ప్రజా ఆశీర్వాద యాత్ర 10వ రోజు బుధవారం కల్వచర్ల నుంచి కమాన్‌పూర్ మండలంలోకి చేరుకుంది. కాంగ్రెస్ నాయకులు కుట్రలను వివరిస్తూ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఆయన తెలిపారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య, మండల అధ్యక్షుడు శెంకేశి రవీందర్, కల్వచర్ల, లొంకకేసారం సర్పంచులు గంట పద్మ, ఎండీ మంజూర్, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, నాయకులు జాపతి శేఖర్, ఎండీ జాఫర్, మల్యాల మోహన్, కొలిపాక సత్తయ్య, దేవ రామస్వామి, కుడిది వేణు, కొప్పుల సునీల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రత్నాపూర్ గ్రామానికి చెందిన సుమారు 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు సర్పంచ్ పల్లె ప్రతిమ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

మహిళల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. కల్వచర్ల, లోంకకేసారం, పన్నూర్ సర్పంచులు గంట పద్మ, ఎండీ మంజూర్, అల్లం పద్మ అధ్యక్షతన మహిళలకు ఆయన బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

అణచి వేయడమే కాంగ్రెస్ ఎజెండా

కమాన్‌పూర్: పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ఆర్థికంగా, రాజకీయం ఎదుగుతుంటే అణచివేయడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని జెడ్పీ చైర్మన్ అభ్యర్థి పుట్ట మధు విమర్శించారు. గుండారం, పేరపల్లి, రొంపికుంట, నాగారం, కమాన్‌పూర్ గ్రామాల్లో జరిగిన ప్రజాఆశీర్వాద యాత్రలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్‌రెడ్డి, రాసకొండ లక్ష్మి, దాసరి రాయలింగు, ఇనగంటి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నా హయాంలోనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ



సత్యనారాయణను సన్మానిస్తున్న అనుచరులు

రామగుండం: తన హయాంలోనే అంతర్గాంలో అభివృద్ధి జరిగిందని, గత ఐదేళ్లలో జరిగిందేమీలేదని రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. అంతర్గాంలో తన ముఖ్య అనుచరులతో బుధవారం సమావేశమయ్యారు. 2018 కన్నా ముందే తాను రామగుండం ఎమ్మెల్యేగా సేవలు అందించానని గుర్తుచేశారు. ప్రజలకు పార్టీతో సంబంధం లేదని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధి తన ప్రధాన లక్ష్యమన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పక్కా భవనం, అంతర్గాం మండల పరిషత్, రైల్వే ఫ్లైఓవర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తదితర పనులన్నీ తాను పూర్తిచేయించినవేనని గుర్తుచేశారు. బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల తన హయంలో ప్రారంభించగా నేటికీ పనులు పూర్తిచేయడం లేదని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని, భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ముఖ్య అనుచరులు మాడ నారాయణరెడ్డి, బోడకుంట సుభాష్, కొదురుపాక పవన్, దేవేందర్, లగిశెట్టి తిరుపతి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

భారతీయ జనతా పార్టీకి అంతర్గాం మండల కమిటీ రాజీనామా చేసినట్లు మండల మాజీ అధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి ప్రకటించారు. ఈ మేరకు బుధవారం అంతర్గాం ప్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండే మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. అభివృద్ధి ప్రదాత వెంట నడుస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల మాజీ కమిటీ ప్రతినిధులు బోడకుంట సుభాష్, లగిశెట్టి తిరుపతి, కొదురుపాక పవన్, సంజీవ్, బండిపెల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'అవసరానికి వాడుకొని వదిలి వేసేవారిని నమ్మొద్దు'



బీమా బాండ్లు అందిస్తున్న మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓట్ల అవసరాల కోసం వాడుకొని వదిలి వేసే వారిని ప్రజలు నమ్మవద్దని డ్రైవర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, నల్ల ఫౌండేషన్ చైర్మన్ నల్ల మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పూసాల పెద్దమ్మ కమ్యూనిటీహాల్‌లో సుమారు 3,000 మంది డ్రైవర్లకు బీమా బాండ్లను ఆయన అందజేసి మాట్లాడారు. కష్టపడి బతికే వారి సంకల్పానికి అండగా నిలిచేందుకే డ్రైవర్లకు ఇన్సూరెన్స్ చేయించామన్నారు. ధర్నాలు చేస్తే ఓట్లు రావని, ప్రజల బాగోగులు చూస్తూ, ఆపద సమయంలో ఆదుకుంటేనే గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు ఎస్‌డీ మజహార్, పోగుల తిరుపతి, తిరుపతిరెడ్డి, మునీర్, మంజూర్, శంకర్, తిరుపతి, సంపత్, ఇమ్రాన్, మల్లేశ్, సబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో అనుమానాలు

- 2019 నుంచి 2022 వరకు అవకాశం
- గైర్హాజర్ డిస్మిస్ కార్మికులకు మరో అవకాశం ఇచ్చిన యాజమాన్యం
- ఆదేశాలు జారీచేసిన సింగరేణి సంస్థ

నిబంధనలివే..

- డిస్మిస్ అయిన దానికి ముందు ఐదేళ్లలో ఏవైనా వంద మస్టర్ల చొప్పున పూర్తిచేసి ఉండాలి
- డిస్మిస్ కార్మికుడు 01–04–23నాటికి 46ఏళ్ల వయసు మించరాదు.
- ఈనెలాఖరులోగా ఆయా గనులు, డిపార్ట్‌మెంట్లపై దరఖాస్తు చేసుకోవాలి
- బదిలీ వర్కర్‌కు అండర్‌గ్రౌండ్ పేరుతో రీ అపాయింట్‌మెంట్ ఉంటుంది.



సింగరేణి కార్మికులు

గోదావరిఖని: ఒకచేత్తో పెట్టినట్టే పెట్టి.. మరోచేత్తో తీసుకున్నట్లుందని సింగరేణిలోని డిస్మిస్ కార్మికులు పరిస్థితి. ఉద్యోగాలు ఇస్తున్నామంటూ జారీచేసిన సర్క్యులర్ నిబంధనలతో అవకాశం దక్కడం లేదు. ఆర్జీ–1 ఏరియాలో నాలుగేళ్లలో నలుగురు డిస్మిస్ అయిన కార్మికులుండగా వారిలో ఒక్కరికి కూడా ఉద్యోగ అవకాశం రాకుండాపోయింది.

ఇదీ నేపథ్యం..

- డిస్మిస్ కార్మికులకు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది.
- సంస్థలోని అన్నిఏరియాల్లో 2019 నుంచి 2022 వరకు గైర్హాజర్‌తో డిస్మిస్ అయిన కార్మికులు అర్హులని ప్రకటించింది.
- ఈమేరకు అన్నిఏరియాలకు ఉత్తర్వులు జారీ చేసింది.
- తద్వారా 11ఏరియాల్లో డిస్మిస్ అయిన కార్మికులకు లబ్ధిచేకూరే అవకాశం ఉంది.
- గుర్తింపు యూనియన్ టీబీజీకేఎస్, డైరెక్టర్(పా) మధ్య మార్చి14న జరిగిన హైపర్‌కమిటీ సమావేశంలో చేసుకున్న ఒప్పందం మేరకు యాజమాన్యం ఆదేశాలిచ్చింది.
- ఈమేరకు సీఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/డీ/102/1168 పేరిట మంగళవారం రాత్రి ఆదేశాలు జారీచేసింది.
- డిస్మిస్‌కు ముందు ఐదేళ్లలో ఏదైనా రెండేళ్లు ఏటా వంద మస్టర్ల చొప్పున డ్యూటీలు చేసి ఉండాలని నిబంధన విధించింది.

నిరాశ పర్చిన సర్క్యులర్..

డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలు కల్పించాలని గుర్తింపు యూనియన్ డిమాండ్ చేసినా.. కండిషన్లతో కూడిన సర్క్యులర్ జారీకావడం కార్మికులను నిరాశకు గురిచేసింది. నిబంధనలేవీ లేకుండా గత నాలుగేళ్లలో డిస్మిస్ అయిన వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈసర్క్యులర్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం.. ఆర్జీ–1 ఏరియాలో నలుగురు డిస్మిస్ కార్మికులు ఉండగా వీరిలో ఇద్దరికి వయస్సు దాటిపోయింది. ఇద్దరికి సరైన మస్టర్లు లేవు. తద్వారా డిస్మిస్ కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

ఏరియా లెవల్‌లో కమిటీ

ఉద్యోగాల కల్పన ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఎస్‌ఓటూ జీఎం, పర్సనల్ విభాగం హెడ్, ఐఈడీ విభాగం హెడ్‌తో కమిటీ ఏర్పాటు చేశారు. దరఖాస్తులను కమిటీ పరిశీలించి నివేదికను కార్పొరేట్‌కు పంపించనుంది. అక్కడ తుది నిర్ణయం తీసుకుంటారు.

బొగ్గుబాయి వార్తలు

కోడ్ ఆఫ్ డిసిప్లేన్ సవరిస్తే ఎన్నికల రద్దుకు సిద్ధం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్



మాట్లాడుతున్న కొరివి రాజ్‌కుమార్

గోదావరిఖని: కోడ్ ఆఫ్ డిసిప్లిన్‌ను 1998కి ముందులా సవరిస్తే ఎన్నికలు రద్దు చేయడానికి తాము అంగీకరిస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఎన్నికలు వాయిదా వేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఎన్‌వన్ సిస్టం ద్వారా ప్లేడే, పీహెచ్‌డీలు తగ్గిస్తూ కార్మికులకు రూ.5వేల నుంచి రూ.20 వేల వరకు ఆర్థికంగా నష్టం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. గుర్తింపు సంఘం యాజమాన్యంతో కుమ్మక్కై సమస్యలపై మాట్లాడకుండా, ఒక్క స్ట్రక్చర్ మీటింగ్ కానీ జరగకుండా చేసిందన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఇవ్వాల్సిన ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్లు, జనరల్ మజ్దూర్ ప్రమోషన్లు ఇప్పటివరకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.ప్రకాశ్, కందుకూరి రాజారత్నం, జిగురు రవీందర్, అన్నారావు, శ్యాంసన్, ఆవుల రవికుమార్, మామిడి మహేందర్, సెగ్గం శంకర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం



చెక్కు అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ సీహెచ్‌పీలో వెల్డర్‌గా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన బట్టి జయంత్ కుటుంబానికి రూ.20లక్ష సాయం మంజూరైంది. ఈసొమ్ము తాలూకు చెక్కును మృతుడి భార్య సాహిత్యకు ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఏలీషా, ఎస్‌వోటూ జీఎం బెధ్య, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీవైపీఎంలు గుర్రం శ్రీహరి, వడ్లకొండ సునీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికి పూర్వవైభవం తెస్తాం

- బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపిస్తే సింగరేణికి పూర్వవైభవం తెస్తామని బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మార్కండేయకాలనీ విశ్వహిందూ పరిషత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఎంఎస్ కేంద్ర కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. కార్మికుల హక్కుల సాధన కోసం బీఎంఎస్ అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. 11వ వేజ్ బోర్డులో చరిత్రాత్మకమైన ఒప్పందం చేశామన్నారు. 19శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్, 5శాతం కోల్‌ఫీల్డ్ అలవెన్స్, 25శాతం అలవెన్సులు సాధించామని అన్నారు. సీఎంపీఎఫ్ డిజిటల్ ఆన్‌లైన్ పద్ధతిని త్వరలో అమలు చేసేలా కృషి చేస్తామన్నారు. రూ.వెయ్యికన్నా తక్కువ పెన్షన్ వస్తున్న కార్మికులకు కనీసం రూ.వెయ్యి ఇవ్వాలనే డిమాండ్ అంగీకరించిందన్నారు. బొగ్గు గనుల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, నాయకులు పులి రాజారెడ్డి, టీఎస్ పవన్‌కుమార్, పేరం రమేశ్, పొన్నమనేని వేణుగోపాలరావు, వై.సారంగపాణి, మాదాసి రవీందర్, గాజుల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



సుమితను అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడాపోటీల్లో ప్రతిభ చూపారు. బుధవారం వారిని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీఈవో మాధవి అభినందించారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని ముక్కెర సమత రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించింది. అలాగే హ్యామర్‌త్రో పోటీల్లో తాజ్‌బేగ్ ప్రతిభను చూపి నాలుగో స్థానంలో నిలిచాడని ఎంఈవో సురేంద్రకుమార్ తెలిపారు.

కోలిండియా కన్నా అదనపు హక్కులు సాధించాం

గోదావరిఖని: కోలిండియా కన్నా అదనపు హక్కులు సింగరేణిలో సాధించామని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వకీల్‌పల్లిగనిపై కార్మికులతో మాట్లాడారు. ఎన్నో హక్కులు సాధించిన టీబీజీకేఎస్‌ను విమర్శించే హక్కు జాతీయ కార్మిక సంఘాలకు లేదన్నారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా సమితితో మహిళలకు ఉపాధి

రామగిరి: సింగరేణి సేవా సమితి అందించే వృత్తి శిక్షణతో మహిళలకు ఉపాధి లభిస్తుందని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. బుధవారం సింగరేణి సేవా భవన్‌లో ఆర్జీ–3 ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధిపై శిక్షణ ఇచ్చారు. అనుభవజ్ఞులైన శిక్షకులతో శిక్షణ అందిస్తామని, అనంతరం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. అధికారులు, ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రతీ ఉద్యోగి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు సూచించారు. జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు గుండె సంబంధిత వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు.

8న పీఎల్‌ఆర్ బోనస్‌పై సమావేశం

గోదావరిఖని: పెర్ఫార్మెన్స్ లింక్‌డ్ రివార్డు(పీఎల్‌ఆర్) బోనస్‌పై ఈనెల 8న కోల్‌కతాలో సమావేశం ఏర్పాటు చేశారు. దేశంలోని అన్నిబొగ్గు సంస్థల యాజమాన్యాలు, ఐదు జాతీయ సంఘాలు హాజరు కానున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి కార్మికులకు చెల్లించాల్సిన బోనస్‌పై చర్చించనున్నారు. గతేడాది పీఎల్‌ఆర్ బోనస్ ఒక్కొక్కరికి రూ.76,500 చెల్లించారు. ఈసారి బోనస్ ఎంత చెల్లించాలనేది ఈమీటింగ్‌లో ఖరారు చేయనున్నారు.

'ఖాళీ స్థలాల లీజుతో కబ్జాలకు అవకాశం'

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 50 డివిజన్లలోని ఖాళీ స్థలాలను లీజుల ఇవ్వడం ద్వారా కబ్జాలకు పాల్పడే అవకాశం ఉందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం బల్దియా ఆవరణలో పారిశుధ్య వాహనాలను పార్కింగ్ చేస్తున్న ప్రదేశంలో ప్రైవేట్ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఒకరిద్దరు ముఖ్య ప్రజాప్రతినిదులు ఉత్సాహం చూపిస్తున్నారని ఆరోపించారు. ఎవరి స్వలాభం కోసం పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పేరు మార్చాలని కౌన్సిల్‌లో తీర్మానం కోసం ఎజెండాలో అంశం చేర్చడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, అఖిలపక్షం సమావేశంతో చర్చించకుండా నగర పాలక సంస్థ పేరును మార్చాలని నిర్ణయం తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

స్వర్ణనంది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

జ్యోతినగర్(రామగుండం): మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సౌజన్యంతో ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త నిర్వహణలో జాతీయ, రాష్ట్రస్థాయి మహానంది, స్వర్ణనంది, శివనంది, గోల్డెన్ నంది, ఇండియన్ నోబెల్ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వ్యవస్థాపకుడు స్వప్నామహేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, జర్నలిజం, కళ, సాంస్కృతిక, న్యాయ తదితర రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న సేవకులు, బాల సేవకులు అర్హులన్నారు. ఆధ్యాత్మిక, వ్యాపార రంగాల్లో కూడా సేవలందిస్తున్న వారూ దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీ లోగా పూర్తివివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాలకు 97046 52590, 97045 10758 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డిస్మిస్ కార్మికులకు ఉద్యోగావకాశాలు

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



చింతల శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణిలో గైర్హాజర్‌తో డిస్మిస్ అయిన కార్మికులకు యాజమాన్యం తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. 2019జనవరి 1 నుంచి 2022 డిసెంబర్ 31వ తేదీ మధ్య ఉద్యోగంలోంచి తొలగించిన వారు అర్హులని పేర్కొన్నారు. కార్మికులు చివరగా పనిచేసిన గనుల కార్యాలయాల్లో విధుల్లోకి తీసుకుంటారన్నారు. డిస్మిస్‌కార్మికులు ఈనెల 31వ తేదీలోపు తమ గనులు, డిపార్ట్‌మెంట్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.